అన్నప్రాశన

"జీవితం జీవించడానికే అన్నట్టు, కళ కళకోసమే పుట్టింది. కళారాధకుడు ఎప్పుడూ ప్రపంచానికొక దివ్య సందేశాన్ని అందిస్తూ వుంటాడు. తన బుద్ధి చాతుర్యాన్నుపయోగించి చిత్ర పరిభాషలో తన ఆదర్శాలూ, ఉద్దేశాలూ వ్యక్తపరుస్తాడు. సామాన్య ప్రజానీకానికి సామాన్యంగానే గోచరించే విషయాన్ని కళా స్రష్ట అయిన చిత్రకారుడు అనేక విధాల రూపకల్పనలచేత ఆశ్చర్యకరంగా చిత్రించగలుగుతాడు. కాబట్టే స్రష్ట అయిన చిత్రకారుణ్ణి అపర బ్రహ్మ అన్నారు. కాని జీవంపోసే శక్తిమాత్రమే అతనిలో లేదు."

అని చదివాడు గోపాలం, చిత్రలేఖనం విషయాల్ని గురించి విపులీకరించబడిన పుస్తకం చూసి. సీత మాట్లాడలేదు. ఊరుకున్నట్లే వుండి ఒక్కసారిగా నవ్వి—

"ఔను నిజం. సామాన్యమైన విషయాలన్నింటికీ ఏనాడో తెల్ల దొరలు రాసిపెట్టిన నిబంధనలను ముడిపెట్టి గాలి పోగుచేసి, నాలుగు పేజీలు నింపి, తమ నైపుణ్యాన్నంతా వినియోగించి రాసి అధికారి హడలిపోయేటట్లుగా టపాలో పంపించి అంతా నాప్రజ్ఞ, నేను కాబట్టి రూల్సన్నీ చూసి రాసి డ్రాఫ్టు పెట్టాను అని ధీమాగావుండి, యథాతథంగా అధికారి సంతకం పెడితే చంక లెగరేసి, కొట్టేసి అవకతవక ప్రశ్నలువేసి డ్రాఫ్టు తిరగ్గొడితే సణుక్కుని, ఓ పండుగా పబ్బమూ, ఆదివారమూ అమావాస్యా, సంవత్సరాదీ శ్రీరామనవమీ లేకుండా కాయితాలు చంకన బెట్టుకుంటూ పొద్దుహా సాయంత్రం ఆఫీసుకు పోవటమనేదికూడా ఒక కళే. చిత్రకారుడి చిత్రం మాదిరే గుమాస్తా డ్రాఫ్టు వుంటుంది. కాబట్టి చిత్రకారుడూ గుమాస్తా ఒకటే!" అంది సీత.

గోపాలం విస్తుపోయి పుస్తకం మూసేశాడు. ఇదేమిటి, సీత యిలా మాటాడుతోంది!

"ఇవాళ ఇట్లా తల్చుకున్నావ్, ఏమిటి విశేషం? మా ఆఫీసు కాయితాలూ, గుమాస్తాలమీద పట్టించావేమిటి?" అన్నాడు.

"లేకపోతే పడుకోక ఎందుకొచ్చిన పుస్తకాలండీ అవి! సాయంత్రంవరకూ ఆఫీసులో రాసి

బి. యస్. ఆర్. కృష్ణారావు

రాసి వచ్చారుకదా! తాగానే భోజనం చేశారు. ఏదో కాసేపు కష్టసుఖాలు మాట్లాడుకోకుండా ఇప్పుడు కళ లెట్లా వుంటే ఎవరిక్కావాలి? చిత్రలేఖనం ఏమయితే ఎవరిక్కావాలి? కానీ వచ్చేదా ఏమన్నానా, చమురు కర్చు తప్ప! అయితే అబ్బాయి అన్నప్రాశన విషయం ఏం తేల్చారు? చెయ్యదల్చుకుంటే మా అన్నయ్యకు ముందుగానే ఉత్తరం ముక్క రాయొద్దూ! మేనమామ ముందు నాకించాలి కదా!"

"ఆడవాళ్లకి ఎంతసేపటికీ ఇలాంటి గొడవలే తప్ప ప్రపంచంలో ఏం జరుగుతున్నదో తెలుసుకోరు. మన దేశ పరిస్థితులు యెలా ఉన్నాయో, దేశంలో ఆహారధాన్యాల కొరత ఎట్లావుందో, దేశనాయకులంతా యీ విషయ సమస్యను పరిష్కరించడానికి ఎంత కష్ట పడుతున్నారో, ప్రజానీకమంతా ప్రభుత్వానికి తోడ్పడాలని ఎన్నెన్ని ఉపన్యాసా లిచ్చి ప్రాధేయపూర్వకంగా అడుగుతున్నారో నీకేమయినా తెలుసూ, రవ్వంతయినా? పత్రికలు చూడు, తెలుస్తుంది. ఆహార సమస్య తేల్చాలంటే ఒక్కటే తరణోపాయం ప్రభుత్వం ఆలోచించింది. దాన్ని అమలులోకూడా పెట్టబోతున్నారుట." అన్నాడు గోపాలం.

"ఏమిటది?" అంది సీత, మొహం చిట్లిస్తూ.

"పెద్దా చిన్నా, ఆడా మొగా అన్న విచక్షణ లేకుండా దేశంలో ఉన్నవారంతా వారాని కొకరోజున విధిగా ఉపవాసం చెయ్యాలి. తద్వారా లంకణం పరమౌషధం అన్నట్టుగా ప్రజారోగ్యం బాగుపడడమే కాకుండా తిండి కొరత తీర్చే విషయంలో ప్రభుత్వానికికూడా సహాయంచేసిన వారవుతారు. దేశ పరిస్థితు లిట్లావుంటే నువ్వేమో అన్నప్రాశనలూ, ముద్ద కుడుములూ, అక్షరాభ్యాసాలూ అంటున్నావు. అన్నం అలవాటయిన మనమే బియ్యం దొరక్క చస్తూంటే అలవాటు లేని వాడికెక్కడా అన్నం అలవాటు చెయ్యట మెందుకు?" అన్నాడు, అన్నప్రాశన విషయంలో తన ఉద్దేశం తెలుపుతూ.

"అలాగే చెప్పారులెండి, చేతకాకపోతే సరి. ఏదెట్లావున్నా అన్నప్రాశన జరక్క తప్పదు. ఒక్కగానొక్క మగపిల్లాడు. చివరికి వాడి చదువు సంధ్యలూ ఆస్తిపాస్తులూ ఎట్లా వున్నా అడుగులోనే హంసపాదు అన్నట్లుగా వాడి అన్నప్రాశన విషయంలోనే మీరు వెనకాడితే యెట్లా?"

"మన సంసార పరిస్థితులు నీకు తెలిసికూడా అలా మాట్లాడితే ఎలా సీతా? ఎంత ఎవర్ని పిలవకపోయినా మా వాళ్ళనీ మీవాళ్ళనీ అయినా పిలవాలా? అంతాచేరి ఓ పదిహేను మందయినా అవుతారా? కనీసం మూడు రోజులయినా వుంటారా? పైవాళ్లు లేకుండా మన కుటుంబం మాత్రం వుంటేనే జీతం డబ్బులు చాలటంలేదు. అటువంటప్పుడు ఇంత జంజాటన పెట్టుకుంటే ఓ యాభై రూపాయిలన్నా తిండిఖర్చు, మరో ఏభై బట్టల కర్చు అవుతుంది. ఈ వందా ఎక్కడ్నుంచి తీసుకురావాలి?"

"అప్పనుకోండి. గొర్రె తోక ఎప్పుడు చూసినా బెత్తెడే అన్నట్లుగా ఇప్పట్లో మీ జీతం ఎక్కువయే సూచనలేవీ లేవు. అందుకని అన్నప్రాశన ఆగుతుందా చెప్పండి! ఒక్కగానొక్క మొగపిల్లాడు, ఇద్దరాడపిల్లల తరవాత! వాడి విషయంలోనే మీరు వెనకాడితే!" అన్నది సీత జాలిగా.

గోపాలం ఆవేశంతో "నాకు మాత్రం పిల్ల అంటే ప్రేమలేదా సీతా! దరిద్రుడికి పిల్లలూ ఎక్కువే, పిల్లలంటే ప్రేమా ఎక్కువే; గొప్ప వాళ్లకు సామాన్యంగా పిల్లలంటూ వుండనే వుండరు. ఒకవేళ వున్నా వాళ్ళను దాదులు పెంచవలసిందే కాని కొమ్ము చెంబుడు పాలు పట్టేందుకయినా కన్నవారికి మన స్సొప్పదు. గొప్పవాళ్ల పిల్లలంతా నూటికి తొంభైమంది నౌకర్లచేతుల్లోనే పెరుగుతారు. ఎందుకంటే అష్టయిశ్వర్యాలమీద మమకారంచేత, ఇంత డబ్బుందికదా అనే గర్వంచేత! బీదవాడికి డబ్బు మీద అపేక్ష వున్నప్పటికీ అది లభ్యం కాకపోవటంనుంచి వాళ్ల దృష్టంతా పిల్లలమీదనే ఇనుమడింపచేస్తారు." అన్నాడు.

"నా కివన్నీ తెలుసు. కాపరాని కొచ్చి ఆయిదారేళ్లయింది; ఇంకా మన సంసార పరిస్థితులు నాకు తెలీవనేనా మీ ఉద్దేశ్యం? పోనీ ఎవ్వరినీ పిలవొద్దు, మా అన్నయ్య కొక్కడికే ఉత్తరం రాయండి రమ్మనమని. ఉంగరంతో

ఆ కాస్త పరమాన్నమూ నాకించి వెళతాడు." కను కొలకుల్లోనుంచి జారే కన్నీళ్లను చీరె చెంగుతో తుడుచుకుంటూ, భారంతో అంది.

ఇంక తప్పదనుకున్నాడు గోపాలం. మర్నాడు బావమరిదికి ఉత్తరం రాశాడు.

"అయితే వాడికి ఏవో కాస్త తేలిక రకమైనా బట్టలు పెట్టొద్దండీ మరి!" అంటూ మొదలెట్టింది సీత.

"బాగానే వుంది, బట్టలూ లేవు ఏం లేవు. ఆపూట వాడూ భోంచేసి పోతాడు, అంతకన్న పెట్టేదేమీ లేదు."

"మీ చాదస్తం బంగారంగానూ! అన్నం నాకించినవాడికి విధిగా బట్టలు పెట్టాలి. వాడు మటుకు ఊరికే చేతులు ఆల్లాడించుకుంటూ వస్తాడా ఏమిటి? వాడి కివన్నీ తెలుసు. మా పెద్దక్కయ్యకొడుకు లిద్దరికీ చేశాడు అన్నప్రాశన. ఆరోజు క్షీరాన్నం ఎందులో పోసి నాకిస్తాడని మీ ఉద్దేశ్యం?" అంది సీత, గోపాలం ఉద్దేశ్యం కనుక్కుందామని.

"ఎందులో పోసే దేముంది. మనం మజ్జిగ పోసుకునే మట్టు సత్తుగిన్నెలో పోస్తే సరి! కాస్త వెడల్పుగా ఉండి పరమాన్నం చల్లార్తుంది, పిల్లాడిగొంతు కాలకుండా" అన్నాడు. ఈమాట విని సీత పొట్ట చెక్కలయేటట్లుగా నవ్వింది.

"ఇంతేనా మీ తెలివి! మేనమామ ఓ వెండి గిన్నె కొనుక్కురావాలి. అందులో పరమాన్నం పొయ్యాలి. అప్పుడు అన్నప్రాశన. అంతేగాని పులుసు రాచ్చిప్పలోనూ మజ్జిగ తప్పేలాలోనూ కాదు. ఓ ఇరవై రూపాయిలు పెట్టి వెండిగిన్నె తెస్తాడేమో, కొత్తబట్టలు కట్టుకుపోతాడు. ఇందులో మనకొచ్చిన నష్టమేముంది చెప్పండి?"

"ఎందుకు సీతా, వాడో పాతికా మన మో పాతికా వొదిలించుకోటం తప్ప, ఇందులో చెప్పుకోతగింది నాకేం కనబడలేదు. పుట్టి పాతిక రూపాయిలు అమ్మేరోజుల్లో పెట్టిన సంప్రదాయాలు బస్తా ధాన్యం పాతికరూపాయిల ఖరీదుగల రోజుల్లోనూ ఆచరించాలంటే ఎంతకష్టమో ఆలోచించు. వాడూ పిల్లలుగలవాడా! పాతికో, ఇరవయ్యో వాడు మటుకు ఎందుకు వదిలించుకోవాలి? నీదంతా చోద్యం కాని!"

"మనం మళ్లా కని పెంచినప్పుడు ఆలోచిద్దాం గాని యీతడవ కిట్లా కానివ్వండి" అని వంటింట్లోకి వెళ్లిపోయింది సీత.

మర్నాటి సాయంత్రానికల్లా వచ్చాడు గోపాలం బావమరది వెంకట్రావు. వస్తూనే గోపాలంతో "ఈ కరువురోజుల్లో ఇంకా అన్నప్రాశనలూ, ముద్దకుడుములూ ఏమిటిరా, ఓ పక్క ఆర్థికంగా దేశం నలిగిపోతూంటే!" అంటూ ఉపదేశాల్లోకి దిగాడు.

"ఆముక్క మీ చెల్లెలికి చెప్పు, ఎంత చెప్పినా సుతరాం చెవి కెక్కించుకోదు. ఈ తడవకు ఇట్లా కానివ్వాల్సిందేనని మంకుపట్టు పట్టి కూర్చుంటే ఇంక చేసేది లేక నీకు ఉత్తరం రాశాను."

వెంకట్రావు మరి మాట్లాడలేదు. తను తెచ్చిన చిన్న వెండిగిన్నె తీసి చెల్లెలికీ బావమరిదికీ చూపించాడు.

"చాలా బావుందిరా, అన్నయ్యా! ఎంత యింది?" అంది గిన్నె చూస్తూ సీత.

"ఇరవై రెండు రూపాయి లయింది."

"అయితే అయిందిగాని చాలా బావుంది. నువ్వుకొనే అన్ని వస్తువులూ చాలా బాగుంటాయి. ఇదిగో మీ బావకొనే వస్తువులు చూడాలి సంబడం!" అంది, గోపాలంవేపు చిలిపిగా చూస్తూ.

"నెలకో నాలుగువందల రూపాయిలు ఎవరయినా ఇస్తూంటే నేనూ ఎంతటి చక్కటి వస్తువులు తేవాలంటే అంత చక్కనివి తేగలను." అన్నాడు గోపాలం యీసడింపుగా.

"ఏతే మా అన్నయ్యకి నెలకి నాలుగయిదు వందలు ఎవరయినా ఇస్తున్నారా ఏమిటి? వాడూ రెక్కలమీద బ్రతుకున్నవాడేగా" అంది సీత.

"సరే ఈ కబుర్లంకేంగాని రేపటి క్కావాల్సిన వేవో చెప్పు"

"అన్నీ తెచ్చారుగా, బట్టలొకటే." అని పని మీద వెళ్ళిపోయింది సీత.

* * *

మర్నాడు అన్నప్రాశన. గోపాలం ఆరోజు సెలవు పెట్టాడు. పదకొండు గంటలకు ముహూర్తం. పిల్లాడికి తలంటి నీళ్లుపోసి పొడుగ్గా కుంకం బొట్టు పెట్టారు. పీటమీద కూర్చో పెట్టి ఎదు

రుగా ఇంకో పీట వేశారు. దానిమీద ఒక చాకు, ఒక కలమూ, ఒక నిమ్మపండూ, ఒక పుస్తకమూ పెట్టారు.

"చాకు పట్టుకుంటే మామంచి శౌర్యవంతుడూ, ధైర్యసాహసాలు కలవాడూ అవుతాడు. కలం తీసుకుంటే వాళ్ళ నాన్నమాదిరి గుమాస్తా ఉద్యోగం చేస్తూ ఉదయాన్నే వెళ్ళి రాత్రికి ఇంటికి వస్తాడు ఉసూరుమంటూ. నిమ్మపండు పట్టుకుంటే వ్యవసాయం చేస్తాడు, పుస్తకం తీసుకుంటే విద్వాంసుడౌతాడు. ఇందులో ఏం తీసుకుంటావు బాబూ?" అంది సీత పిల్లాడి బుగ్గలు ముద్దుగా సాగదీస్తూ.

"నాపోలికే కానాలి వాడికి! ఈ గుమాస్తా ఉద్యోగం వద్దులే బాబూ వాడికి. నే ననుభవిస్తున్నా చాలదూ!" అన్నాడు గోపాలం.

పిల్లవాడు అయిదు నిమిషాలు వాటన్నింటినీ చూస్తూ చేతులు ఆడిస్తూ నవ్వుతూ కలం తీసి నోట్లో పెట్టుకుని, నిమ్మపండొక చేత్తో, కత్తి ఒక చేత్తో పట్టుకుని పుస్తకంమీద ఎక్కి కూర్చున్నాడు.

"వీడు అందర్నీ మించిన వాడవుతాడు. మంచి అదృష్టవంతుడౌతాడు." అన్నాడు మేనమామ.

"వాడు పెద్దవాడైన తరవాతనే నాకు యాత్రల మనస్సు గాని, పుణ్యక్షేత్రాలు చూట్టం గాని జరిగేది. వీళ్ళ నాన్న హయామంతా వంటింట్లోనే గడిచిపోతుంది." అంది సీత.

"పోనీలే నా జీవితం ఇంట్లోనే వెళ్ళిపోతుంది. నన్నుద్ధరించేవాడు వాడేననుకో. వాడు పెద్దవాడై సంపాదించేటంత వరకూ నేనే పోషించాలి కదా! అందాకా నే చెప్పినట్లుగా విను. తరువాత నువ్వూ నీ కొడుకూ ఒకటవుదురుగాని!" అన్నాడు.

వెంకట్రావు రిష్టువాచీ చూసి "పవకాం చయింది, ఇంక పరమాన్నం నాకిస్తాను" అని వేలి ఉంగరం తీసి పరమాన్నంలో ముంచి మూడు సార్లు నాకించాడు.

"ఇక వీణ్ణి కూడా శేషు లెక్కల్లో చేర్చొచ్చు" అన్నాడు వెంకట్రావు.

"మేం ఇంత లక్షణంగా తింటున్నాం. ఇంక వీడు తినలేకపోయాడు." అన్నాడు గోపాలం.

"శుభమా అంటూ అన్నప్రాశన చేసుకుంటూ ఈ పాడుమాటలు మాట్లాడతారేం!" అంది సీత.

"బాబుగారూ" అనే కేక వీధిలో వినిపించింది.

"ఎవరూ?" అంది సీత.

"నేనండీ అమ్మగారూ అప్పన్నని. బాబుగారున్నారా?"

"ఎందుకోయ్ అప్పన్నా? దొరగారు పిల్చారా?" అంటూ బయటికొచ్చాడు గోపాలం.

"దొరగారు రమ్మంటున్నారండీ. ఏదో టెలిగ్రాం వచ్చిందిట. అర్జంటుగా నిల్చున్నపాటున రమ్మంటున్నారు."

"సరే భోంచెయ్యబోతున్నాను. వస్తా పద" అన్నాడు గోపాలం. అప్పన్న వెళ్ళిపోయాడు.

'సెలవు పెట్టినా అనుభవించే యోగం లేదు. పాడుఉద్యోగం" అంది సీత.

గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఆఫీసుకు వెళ్ళాడు గోపాలం. గోపాలాన్ని చూడగానే మండిపడుతూ,

"ఏమయ్యా, ఈ టెలిగ్రాం చూడు. గ్రోమోర్ ఫుడ్ రిటరన్ పంపించక్కరలేదూ? అది పంపించకుండానే సెలవు పెట్టావే! టెలిగ్రాం వచ్చేటంత వరకూ కళ్ళు మూసుకుని కూర్చున్నావ్. ఇంకవరకూ ఏం చేస్తున్నావ్?" అన్నాడు ఆఫీసరు.

"చిత్తం. ఇవాళికి నాలుగు రోజులే అయిందండి రిటరన్ ఓవర్‌డ్యూ అయి. అయినా నిన్నటిదాకా ఆ కాయితాలతోటే సరిపోయింది. ఇవాళ వేసేస్తానులెండి సాయంత్రానికల్లా."

"ఇవాళ మనాఫీసు నుంచి రిటరన్ వెళ్ళేటంత వరకూ ఆఫీసు వదలటానికి వీల్లేదు తెల్సిందా? నే బంగళాలో వుంటా. పూర్తి చేసి నాదగ్గరకు తీసుకురా సంతకాలకి." అని మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు ఆఫీసరు.

ఇంటిదగ్గర అన్నప్రాశన తతంగం కాకపూర్వమే ఇట్లా రావాల్సొచ్చిందని తనను తాను నిందించుకున్నాడు. స్టేట్మెంట్లు బల్లమీద పరిచి కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఏనాటి

కర్మఫలమో ఈనాడు అనుభవిస్తున్నా ననుకున్నాడు. ఆఫీసు ఎదురుగా ఉన్న మేడమీదనుంచి రేడియోపాటలు వినిపిస్తున్నాయి. "మా బాబు పెద్దవాడైతే వాళ్ళ నాన్న మాదిరిగా గుమాస్తా ఉద్యోగం చెయ్య"డని సీత అన్న మాటలు పదేపదే స్ఫురణకు వస్తున్నాయి. పిల్లవాడు అన్ని వస్తువులూ తీసుకుని పుస్తకంమీద కూర్చున్నప్పుడు "వీడు అందర్నీ మించినవాడవుతాడు. మంచి అదృష్టవంతు డవుతాడు" అన్న బావమరది మాటలు ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఎవరెట్లావున్నా, ఎవరెన్ని అన్నా, ఎవరెంత అదృష్టవంతులయినా నువ్వు మటుకు చేసేది ఈ లోవర్ డివిజను గుమాస్తావనే అన్నది అంతర్వాణి. అవును అనుకుని తెల్లకాయితాలమీద స్టేట్‌మెంట్‌ఫారం గీస్తున్నాడు. రేడియోలో పాట వినిపిస్తున్నది. తన పరిస్థితి కనుగుణంగానే ఉన్నదా పాట. వేణునాదానికి గోవులు తలలెత్తి ఆలకిస్తున్నట్లుగా, నాగస్వరానికి నాగుబాములు పడగలెత్తి వింటున్నట్లుగా వినసాగాడు.

పాట విన్నాడు గోపాలం. అతని అంతరాత్మ అభిమానంతో క్రుంగిపోయింది. ఇచ్చేది ఎనభై రూపాయిలు, నెలఖర్చు అంతకు నాలుగురెట్లు. చేస్తున్నది గుమాస్తాగిరీ. తినేవి చివాట్లు. అభిమానంచేత ఒళ్ళు జలదరించింది.

స్టేట్‌మెంట్‌ఫారం గీసి మొదటి ఐటము రాస్తున్నాడు.

"గోపాలం, గోపాలం" అంటూ వెంకట్రావు రోజుకుంటూ వచ్చాడు. అతని గుండె నిమిషానికి కొన్నివందలసార్లు కొట్టుకుంటున్నట్లువుంది. అతని వాలకం చూస్తే ముచ్చెమటలు పోశాయి. ముఖాన కత్తివేసినా నెత్తురుచుక్క లేదు.

"ఏమిటి బావా ఇట్లావచ్చావ్. ఏం ప్రమాదం జరిగింది?" అన్నాడు ఆదుర్దాగా—వెంకట్రావు భుజాలు పట్టుకుని ఊపుతూ.

"ఏం చెప్పను! బాబు..."

"బాబు ఏమైనాడు? నే వచ్చేటప్పుడు పరమాన్నం తిని ఆడుకుంటున్నాడుగా!"

గోపాలం కాళ్లవణికాయి నాలుక తడారిపోయింది.

"బాబు పోయినాడు" అన్నాడు వెంకట్రావు చెప్పలేక.

"బాబు పోయినాడా!" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఇట్లా కూర్చుంటే ఎట్లా? పోదాంపద." అన్నాడు వెంకట్రావు.

"ఎంతపని జరిగింది! వెళ్ళిరండి గోపాలం గారూ" అన్నారు తోడిగుమాస్తాలంతా.

నిల్చున్నవాడు నిల్చున్నట్లుగానే బయల్దేరాడు గోపాలం. వరండాలోంచి దిగుతూవుండగా బంగళాజవానొచ్చి "గ్రోమోర్‌ఫుడ్ రిటరన్ట, అయిందాండి గోపాలంగారూ?" అన్నాడు.

గోపాలానికి ఇదేదీ వినిపించలేదు.

"గ్రోమోర్‌ఫుడ్ రిటర్న్ అర్జంటుగా పట్రమ్మన్నారండీ!" అని మళ్ళీ కేకవేశాడు జవాను.

జంతు శాస్త్రంలో మొదటి పాఠాలు

స్త్రీ పురుషులు ఒండొరులను ఆకర్షించుకుందుకు చేసే ప్రయత్నాలూ, కట్టుకునే రంగుల దుస్తులూ, పూసుకునే సువాసన ద్రవ్యాలూ, పెట్టుకునే పూల చెండ్లూ యివన్నీగాక పెద్దలు వ్రాసిపెట్టిన గ్రంథాల ద్వారానూ, చిత్రకారులు వ్రాసిపెట్టిన చిత్రాల ద్వారానూ, పడకగదులలో తలుపులు బిగించుకుని కూర్చొని పొందే రహస్య వాతావరణంలో, ఒంటరితనంలో, సిగ్గు బిడియాలనుంచీ, దుస్తులు మొదలైన కట్టుబాట్లనుంచీ, తాత్కాలికంగా పొందే మోక్షంద్వారానూకూడా వీరిలో కాముక వ్యాపారదృష్టి ప్రబలింది. యాతావాతా, మనుషులు యితర జంతువులకు మల్లేగాకుండా జాత్యభివృద్ధితోబాటు శృంగార కళ అనే - పశుపక్ష్యాదులకు అర్థంకాని - ఒక ప్రత్యేక కళను అమలులోకి తీసుకువచ్చారు. ఇది మానవజాతికి వివాహాన్నీ, శోభనూ, శోభనపు గదులను, అల్లసాని పెద్దన్నలనూ, శృంగార శ్రీనాథులనూ, డాన్‌జుఆన్‌లనూ, వ్యభిచారాలనూ, డైవోర్సుకోర్టులనూ ప్రసాదించింది.—(శ్రీరామమూర్తి)